క్లుప్తంగా

నేడు అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 8 గంటలకు ఇరువాడలో ప్రారంభించి బాటజంగాలపాలెం, గాలిభీమవరం గ్రామాల్లో.. సాయంత్రం 5 గంటల నుంచి గొటివాడ,పైడివాడ,అసకపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారన్నారు. పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నేత సూరిబాబుకు పరామర్శ



మెంటి సూరిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మెంటి సూరిబాబును గురువారం రాత్రి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. చినముషిడివాడలోని సూరిబాబు ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జనసేన కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య గురువారం స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాల కార్యకర్తలు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశామని సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. ఎన్నికల ప్రచారం శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ బాల సూర్యారావు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా సెక్షన్-1 పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్-1 పరిధిలోని 33/11 కేవీ, సబ్బవరం సబ్‌స్టేషన్-11 కేవీ ,సబ్బవరం ఎంహెచ్‌క్యూ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందన్నారు. సబ్బవరం సబ్‌స్టేషన్ పరిధి లోని సబ్బవరం,గొర్లివానిపాలెం,చిన్నయ్యపాలెం ,గొల్లలపాలెం,ఆదిరెడ్డిపాలెం, పెదనాయుడుపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సత్యజిత్ రే చిత్రాలు ఆణిముత్యాలు



సత్యజిత్ రే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ కమిషనర్ గోపీకృష్ణ తదితరులు

సీతంపేట: ఆస్కార్ అవార్డు గ్రహీత, భారత రత్న సత్యజిత్ రే సినిమా రంగంలో భారతదేశం గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరని ఆదాయ పన్ను శాఖ అడిషన ల్ కమిషనర్ గోపీకృష్ణ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సత్యజిత్ రే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గోపీకృష్ణ మాట్లాడుతూ సత్యజిత్ రే తీసిన చిత్రాలు ఎప్పటికీ ఆణిముత్యాలుగా కీర్తి పొందాయన్నారు. భారతీయ చలనచిత్ర రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి ఆస్కార్ అందుకున్న రే చిరస్మరణీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్ : బురు జుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలి.

పవన్.. పిచ్చి కూతలు మానుకో..

- స్క్రిప్టులు చదవడం మాని నిజాలు తెలుసుకో
- అవినీతిపరుడన్న పంచకర్లకు టికెట్ ఎందుకు ఇచ్చావ్
- హుందాగా రాజకీయాలు చేయడం నేర్చుకోండి
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఫైర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: 'పవన్ కల్యాణ్...పార్టీలు మారిన వారికి మీ పార్టీలో టికెట్ లేదంటావ్.. నాలుగు పార్టీలు మారిన పంచకర్ల రమేష్‌బాబును నీ పార్టీలో చేర్చుకున్నావ్..యలమంచిలిలో పంచకర్ల రమేష్‌బాబు మైనింగ్ ద్వారా రోజుకు రూ.6 లక్షలు దోచుకున్నాడని నువ్వే అన్నావ్..మళ్లీ రమేష్‌బాబు మంచివాడు.. గెలిపించండని నువ్వే అంటావ్.. ఎక్కడికెళ్లినా పిచ్చి మాటలు..స్క్రిప్ట్ డైలాగులు చెప్పడం తప్పా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మరొకటి తెలియదని' పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. స్క్రిప్టులు చదవడం మాని నిజాలు తెలుసుకుని పవన్ కల్యాణ్ మాట్లాడాలని హితవు పలికారు. పెందుర్తి మండలం రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అదీప్‌రాజ్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెందుర్తి బహిరంగ సభలో పవన్ కల్యాణ్ తనపై నిరాధారమైన, తప్పుడు ఆరోపణలు చేశారని ఖండించారు. 2019 ఎన్నికల సమయంలో యలమంచిలి టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న పంచకర్ల రమేష్‌బాబు మైనింగ్ ద్వారా రోజుకు రూ.6 లక్షలు సంపాదించారని పవన్ కల్యాణ్ అనలేదా అని ప్రశ్నించారు. అలాంటి వ్యక్తిని పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చి ఇప్పుడు గెలిపించాలని ఎలా అంటారని ప్రశ్నించారు. పెందుర్తిలో తాను వసూళ్లు చేస్తున్నానని చెబుతున్న పవన్ కల్యాణ్‌ను చూస్తే జాలి వేస్తుందన్నారు. సర్పంచ్‌గా ఉన్ననాటి నుంచి ఇప్పటివరకు పేదలు ఇళ్లు కట్టుకుంటే సహాయం చేశానని.. ఆ విషయం ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. తన సేవాగుణం నియోజకవర్గంలోని ప్రజలందరికీ తెలుసు అని చెప్పారు. రాజకీయాల్లో హుందాతనం ఉండాలని..జనసేన, టీడీపీ వల్ల రాజకీయాలు భ్రష్టుపట్టాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గూండాలు అని చెబుతున్న పవన్ కల్యాణ్..ఇటీవల పెందుర్తిలో జరిగిన జనసేన నాయకుల ఆగడాలను ఒక్కసారి తెలుసుకోవాలని హితవు పలికారు. 88వ వార్డు టీడీపీ కార్పొరేటర్, బీసీ నాయకుడు మొల్లి ముత్యాలనాయుడును పంచకర్ల రమేష్‌బాబు అనుచరుడు గల్లా శ్రీనివాసరావు అందరి ముందు కొట్టిన సంగతి పంచకర్ల పవన్‌కల్యాణ్‌కు చెప్పలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని కలలు కంటూ రౌడీయిజం చేస్తున్న జనసేన నాయకులు గూండాలా..ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గూండాలా అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎవరి పని వారు చేసుకుంటే మంచిదని..లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, పార్టీ సీనియర్ నేతలు ముమ్మన దేముడు, ఉప్పిలి కనకరాజు, గండి రవికుమార్, జేసీబీ ప్రసాద్, చందు యాదవ్, గొరపల్లి శ్రీను, పాలిశెట్టి సురేష్‌రాజ్, దాసరి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముచ్చట: ఔను.. వాళ్లిద్దరూ ఇష్ట పడ్డారు!



'ఏరా అప్పిగా కనపడ్డం మానేశావ్..ఎక్కడికి ఎల్లిపోనావ్‌రా..'పెందుర్తిలో చాన్నాళ్ల తర్వాత తారసపడ్డ అప్పారావుని ఆప్యాయంగా పలకరించాడు కన్నారావు.

'ఏం లేదురా కన్నిగా ఒంట్లో నలతగా ఉంటే డాక్టరు దగ్గరకెళ్లాను..ఎండలన్నాళ్లు బయట ఎక్కువ తిరగొద్దన్నాడు' అని తన బాధను చెప్పుకున్నాడు కన్నిగోడు.

'హా జాగర్తరా బాబు..ఈ ఎలచ్చన్లు అవీ ఇవీ అని అటూ ఇటూ తిరక్కు' అంటూ జాగ్రత్త చెప్పాడు అప్పిగోడు.

'అలాగే నేరా..ఇంకేటిరా అప్పిగా కబుర్లు.. ఎలచ్చన్లు ఎలా ఉన్నాయిరా..పెందుర్తిలో ఈపాలి ఎవడొత్తాడంటావ్' అని ఆరా తీశాడు కన్నిగోడు.

'ఏం ఎలచ్చన్లు రా..ఈ కుర్రోడేమో జనమందరితో తిరుగుతుండు..ఆ గాజు గుర్తోడు ఆడి కులపోళ్లతో తిరుగుతన్నాడు' అంటూ దీర్ఘం తీశాడు అప్పిగోడు.

'అవున్రా అప్పిగా..ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ కులాన్ని బలే రెచ్చగొడుతున్నాడ్రా..ఏ మాట కా మాట గానీ..మనోడు చొక్కాలు మార్చినంత వీజీగా జెండాలు మార్చేత్తాడ్రా' అన్నాడు కన్నిగోడు.

'ఎన్ని మార్చినా..ఎంత మంది కులపోళ్లను తిప్పుకున్నా..ఈ సారీ కుర్రోడే వచ్చేత్తాడ్రా' అన్నాడు అప్పి గోడు.

'ఇంతకీ సైకిల్ గుర్తోడి పరిస్థితి ఏటో' అని ఆరా తీశాడు కన్నిగోడు..

'ఇంకేం సైకిల్‌ర్రా..అది పెందుర్తి నుంచి మాడుగుల పోయింది..ఎన్నుపోటోడు కొట్టిన దెబ్బకి అక్కడికి పోయి ముక్కి మూలుగుతున్నాడ్రా..అని ఎద్దేవా చేశాడు అప్పిగోడు.

'ఇంతకీ సైకిలోడు..గలాసోడు కలిసారా' అని ఆరా తీశాడు కన్నిగోడు.

'మొన్నటి దాకా గ్లాసు పగల గొడతానన్న సైకిలోడు పక్కూరులో సీటు ఇవ్వగానే తోక ముడిచి గలాసోడికి చిత్తం దొరా' అని దాసోహం అయిపోయాడ్రా..అన్నాడు అప్పిగోడు

'ఇదెట్రా ఇది అంతన్నడు ఇంతన్నాడు ఆ సైకిలోడు..ఇప్పుడిదెట్రా' అని నివ్వెర పోయాడు కన్నిగోడు.

'అవున్రా బాబు..వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు..ఈ కుర్రోడిని కష్టపెట్టడానికి చూత్తాన్రా' అంటూ ఒకింత కోపాన్ని ప్రదర్శించాడు అప్పిగోడు.

'ఆడు ఈడు కలవడం ఏట్రా..సైకిలోడేమో గలాసోడిని ముఠాకోరు..దొంగోడు అన్నాడు....గలాసోడేమో బాబు-చినబాబు కలిసి దోచేసి తెల్లకార్లో ఎత్తుకుపోతున్నారు అన్నాడు' అంటూ ఇటీవలే ఇద్దరి మధ్య జరిగిన ప్రేమ'పూర్వ'క సంభాషణను గుర్తు చేశాడు కన్నిగోడు.

'ఏమోరా..అతడ్ని ఇతడు ఛీకొట్టాడు..ఇతన్ని అతడు దగ్గరకే చేరనివ్వలేదు..ఒక రకంగా అంటరానోళ్ల లాగా చూసుకున్నారు..అలాంటిది మొన్న ఇషాకపట్నం 'చంద్రన్న' వచ్చి సైకిలోడికి 'కానుక' ఇచ్చేసరికి' ఇలా దిగజారిపోయాడ్రా..అంటూ నిజం చెప్పాడు అప్పిగోడు.

'వార్ని సైకిలోడు ఇంత చీప్ ఏట్రా..ఆడేదో పెద్ద పోటుగాడు అనుకున్నాం..చివరకు గలాసు గుర్తు గుంటలతో కూడా అమ్మనా బూతులు తిట్టించుకుని..మళ్లీ ఆడికే జై కొడతాడా' అంటూ ఆసహనం వ్యక్తం చేశాడు కన్నిగోడు.

'ఏమున్నాదిరా సీటు సిరిగిందన్నారు..అలాంటోడికి బాబోరు మళ్లీ బిస్కెట్ వేశాడు..ఇంకేం ఉందిరా తోకూపేశాడు' అన్నాడు అప్పిగోడు.

'ఏదోటి చేసుకోనిరా అప్పిగా..ఎటు చూసినా ఈ కుర్రోడి 'ఫ్యాన్' గాలి ముందు ఈలంతా ఎక్కడ నిలబడతార్రా అంటూ అక్కడి నుంచి వెళ్లి పోయాడు కన్నిగోడు.

– పెందుర్తి

వలస పక్షులను తరిమి కొట్టండి

- సంక్షేమ పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యం
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అదీప్‌రాజ్



చినముషిడివాడలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

పెందుర్తి: 'ఐదేళ్ల పాటు మీలో ఒక్కడిగా ఉన్నాను.. ఏ కష్టం వచ్చినా ముందున్నాను.. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో మీతోనే నడిచాను.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని మీకు సక్రమంగా అందేలా చేశాను..అభివృద్ధికి బాటలు వేశాను..సంక్షేమం అందించడానికి కులం..మతం..పార్టీలు..ప్రాంతాలు చూడలేదు.. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మమ్మల్ని ఆశీర్వదించండి..సంక్షేమాన్ని సుస్థిరం చేస్తాం..అభివృద్ధిని కొనసాగిస్తాం' అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభ్యర్థించారు. ఎన్నికల కోసం వచ్చిన వలస పక్షులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి జీవీఎంసీ 95,97వ వార్డు చినముషిడివాడ, పాతూరు, ఎస్సీబీసీ కాలనీ, చినముషిడివాడ ప్రధాన రహదారి ప్రాంతాల్లో అదీప్‌రాజ్ విస్తృత ప్రచారం చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు, యువకులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలతో ముంచెత్తారు. అక్కాచెల్లెమ్మలు హారతులు పట్టి విజయతిలకం దిద్దారు. ప్రచార రథంపై యువకులు పూలు చల్లుతూ అభిమానం చాటుకున్నారు. అన్నిచోట్ల సీఎం వైఎస్ జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో, మెరుగుపరిచిన నవరత్నాల పథకాల గురించి అదీప్‌రాజ్ ప్రజలకు వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వ వార్డు పార్టీ ఇన్‌చార్జి మెంటి మహేష్, ఆయా ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.62,120 స్వాధీనం

సబ్బవరం: వెదుళ్లనరవ శివారులో నిర్వహిస్తు న్న పేకాట స్థావరంపై గురువారం దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వెదుళ్లనరవలోని ఆంజనేయస్వామి ఆలయం వెనుక కొంతమంది పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. సీఐ ఆదేశాల మేరకు హెచ్‌సీ సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో విశాఖ పరిసర ప్రాంతాలకు చెందిన కూర్మన్నపాలెం,కంచరపాలెం,వడ్లపూడి,టౌన్ కొత్తరోడ్డుకు చెందిన 7గురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. కొంత మంది తప్పించుకొని పారిపోయారన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.62,120 నగదు,పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రూ.17.17 లక్షల నగదు సీజ్

సబ్బవరం: ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో అనుమతి లేకుండా పరిమితికి మించి తరలిస్తున్న రూ.17.17 లక్షల నగదు సీజ్ చేసినట్టు సీఐ పిన్నింటి రమణ గురువారం తెలిపారు. మండలంలోని పలు ప్రదేశాల్లో ఎలక్షన్ స్పెషల్ టీంలతో కలిసి పోలీసులు తనిఖీలు నిర్వహించి పరిమితికి మించి నగదు తీసుకువెళ్తున్న నలుగురు వ్యక్తుల నుంచి ఈ నగదు సీజ్ చేసినట్టు చెప్పారు.

- గొల్లి వరలక్ష్మి అనే మహిళ వద్ద సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో రూ.10 లక్ష నగదు పట్టుకొన్నారు. అయితే బ్యాంకులో నగదు విత్ డ్రా చేసి పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసుకునేందుకు పట్టు కెళ్తున్నట్టు ఆమె తెలిపారు.
- డి. శివకృష్ణ అనే వ్యక్తి వద్ద సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో రూ.5 లక్షల స్వాధీనం చేసుకున్నారు.రైస్ మిల్లులో లేబర్‌కు జీతాలు చెల్లించేందుకు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి పట్టుకెళ్తున్నట్టు శివకృష్ణ చెబుతున్నారు.
- సీహెచ్ మల్లునాయుడు అనే వ్యక్తి వద్ద బోడవరం రోడ్డులో రూ.1.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.సెంట్రల్ బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి ముత్తూట్ ఫైనాన్స్‌కు తీసుకెళ్తున్నట్టు అతను తెలిపారు.
- ఎస్‌కే రెహమాన్ అనే వ్యక్తి వద్ద నుంచి గుల్లేపల్లి వద్ద రూ.1.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అయితే పశువులను కొనేందుకు వెళ్తున్నట్టు రెహమాన్ తెలిపారు.

కష్టాలు ఎదుర్కొని ముందుకు సాగాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: కష్టాలను ఎదుర్కొని ధైర్యంతో ముందుకు సాగాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గురువారం ఏయూ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్య ల నివారణ కమిటీ రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్టీఫెన్ మాట్లాడుతూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, జీవితం ఎంతో విలువైనదని సూచించారు. ప్రతి ఒక్కరికీ మేము ఉన్నామంటూ భరోసానిస్తే ఆత్మహత్యలు తగ్గుతాయన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ గత పదేళ్లలో 28 మందిని ఆత్మహత్య చేసుకోకుండా కాపాడడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి డాక్టర్ పరికిపండ్ల అశోక్, తత్వశాస్త్ర విభాగాధిపతి వానపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

16 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మండలంలోని మడకపాలెం గ్రామానికి చెందిన సేనాపతి సోమునాయుడు, పరవాడ గ్రామానికి చెందిన నున్న రాఘవేంద్రరావులు 16 మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తుండగా పరవాడ ఏఎస్‌ఐ బి.వై.నాయుడు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని సీఐ బాలసూర్యారావు చెప్పారు.

ఆదరించండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారంఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి ఉపాధి కూలీలను కలిసి ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. పొత్తులు, మోసపూరిత హామీలతో ముందుకు వస్తున్న చంద్రబాబును నమ్మవద్దని కోరారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను,ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, ఎంపీటీసీ కర్రి అప్పారావు,సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలవేణి, పార్టీ సీనియర్ నాయకులు మొల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం



ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ఫొటోలతో నాయకులు



పరవాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు

పరవాడ: మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు మద్దతుగా ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు కార్యకర్తలతో కలసి పరవాడలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తు చూపించి ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం, గొల్లపేట, దీపాంజలినగర్ ప్రాంతాల్లో పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాడచీపురుపల్లి ప్రాంత ప్రజలతో తనకున్న సత్సంబంధాలను వివరిస్తూ , సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని మళ్లీ ఫ్యాను గుర్తుపై ఓటేసి అదీప్‌రాజ్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, వాడచీపురుపల్లి సచివాలయ కన్వీనర్ కూండ్రపు తాతాజీ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలు అందాలంటే.. జగనే రావాలి

పరవాడ: సంక్షేమ పథకాలు నేరుగా ఇళ్లకు చేరాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మిసీతారామయ్య పిలుపునిచ్చారు. పెందుర్తి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్, అనకాపల్లి ఎంపీ బూడి ముత్యాలనాయుడుకు మద్దతుగా నాయుడుపాలెం పంచాయతీలో వెంకటపతిపాలెం, రాముడుగారి గ్రామం, సిమ్మన్నగారి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా అదీప్‌రాజ్ను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోనాయకులు పైల ముత్యాలనాయుడు, కె.సన్యాసినాయుడు, కన్నూరు నరేష్ పాల్గొన్నారు.

సబ్బవరం: మొగలిపురంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవి కుమార్ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు తదితరులు పాల్గొన్నారు.



పందివానిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న అదీప్‌రాజ్ తండ్రి సత్యనారాయణ



రాముడుగారి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మొగలిపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గండి రవికుమార్ తదితరులు



వెదుళ్లనరవలో ప్రచారం నిర్వహిస్తున్న చొప్పా నాగరాజు తదితరులు

- వెదుళ్లనరవలో మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సర్వసిద్ధి బోరయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాగుకు ప్రోత్సాహం



వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాల ద్వారా అందుబాటులోకి వచ్చిన ట్రాక్టర్లు(ఫైల్)

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది.సాగును లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. దీనిలో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణపై ప్రభుత్వం దృష్టి సారించడంతో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 17 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.ఆయా రైతు భరోసా కేంద్రం పరిధిలో కొంత మంది రైతులు ఒక సంఘంగా ఏర్పడి వారి భాగస్వామ్యంతో ఈ కస్టమ్ హైరింగ్‌సెంటర్ ఏర్పా టు

రాయితీపై యంత్ర పరికరాలు

చేసుకోవచ్చు. ఒక్కో సంఘానికి రూ. 15 లక్షల విలువ చేసే యంత్ర పరికరాలను 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుంది. కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసిన కేంద్రాలు మండలంలోని నారపాడు, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, సబ్బవరం, అమృతపురం, గొల్లలపాలెం, అసకపల్లి, గొటివాడ, పైడివాడ అగ్రహారం, వంగలి, బంగారమ్మపాలెం, బోదువలస, మొగలిపురం,బాటజంగాలపాలెం,తవ్వవానిపాలెం రైతు భరోసా కేంద్రాల్లో ఈ కస్టమ్ హైరింగ్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయి.

పరికరాలు ఇవీ

కస్టమ్ హైరింగ్ సెంటర్‌లో ఒక ట్రాక్టర్,వరి నూర్పిడి యంత్రం,ట్రాక్టర్ దమ్ము సెట్,దుక్కు దున్నేందుకు 11 నాగళ్ల సెట్,9 నాగళ్ల సెట్,రోటా వీటర్,పవర్ స్ప్రేయర్,కలుపు తీసుకునే వీడర్ వంటి పలు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయి.

..... వీటిని ఆయా గ్రూపు సభ్యులు సొంతానికి వినియోగించుకోవడంతో పాటు రైతులకు తక్కువ ధరలో అద్దె నిర్ణయించి అందుబాటులో ఉంచుతారు.రైతులు వాటిని నిర్వహించేందుకు అవసరమైన స్వల్ప అద్దెతో యంత్ర పరికరాలను వినియోగించుకోవచ్చు.